## బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

- మంత్రి కొప్పుల ఈశ్వర్



కరీంనగర్‌లో క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి, అక్టోబర్ 12: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం అని, సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు ఈ 45 రోజులు కష్టపడి పనిచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గురువారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌కు యాదవ సంఘం అధ్యక్షుడు తొట్ల శంకర్, ఎస్సీ సంఘం అధ్యక్షుడు బాలె దుర్గయ్య, ఒడ్డెర సంఘం అధ్యక్షుడు మ్యాగేని ఎల్లయ్య, పుప్పాల ఆదిరెడ్డి, గాజర్ల రాజు, గాదర్ల తిరుపతి వారి అనుచరులతో కలిసి చేరగా, మంత్రి ఈశ్వర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్సాని నిహారిక-శ్రీనివాస్, పార్టీ నాయకులు చింతల అశోక్, బండారి సతీశ్, రామడుగు శ్రీనివాస్ ఉన్నారు.

## పేదల పెన్నిధి సీఎం కేసీఆర్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జగిత్యాల శివారులోని మోతెలో బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌ను సన్మానిస్తున్న మహిళలు

జగిత్యాల, అక్టోబర్ 12: సంక్షేమమే, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్, నిరుపేదల పాలిట పెన్నిధిగా నిలుస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 20వ వార్డుకు చెందిన 20 మంది ఆడబిడ్డలు డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరైన సందర్భంగా గురువారం మోతెలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడారు. ఆడబిడ్డల సంతోషమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. ఇండ్లులేని నిరుపేదల కోసం హైదరాబాద్ తర్వాత అత్యధికంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏకంగా 4,520 ఇండ్లు నిర్మించి, అందజేసినట్లు చెప్పారు. కొన్ని పనులు జరుగుతున్నాయని, పూర్తయిన తర్వాత లబ్ధిదారులు వెళ్లి ఉండవచ్చన్నారు. ఇండ్లు రానివారు అధైర్య పడవద్దని, ఇంకా 800 ఇండ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్దోస్ తరున్నాం నదీం, ముఖీం, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసీఫ్, జమీల్, నాజీం, తదితరులు పాల్గొన్నారు



మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి డా. సంజయ్ కల్వకుంట్ల

# కోరుట్లలో బీఆర్‌ఎస్ జోరు

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 12: కోరుట్లలో బీఆర్‌ఎస్ దూసుకెళ్తున్నది. ప్రతిపక్షాల అంచనాలు తలకిందులు చేస్తూ ముందుకు సాగుతున్నది. ప్రచారంలో జోరు కొనసాగిస్తూ ప్రజల్లోకి వెళ్తుండగా, మరో వైపు ప్రతిపక్ష పార్టీల నుంచి చేరికల జోరు కొనసాగుతున్నది. గురువారం మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట, జగ్గసాగర్, ఆత్మకూర్ గ్రామాల్లోని బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన పలువురు యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. జగ్గసాగర్‌లో బీజేపీకి చెందిన ఉపసర్పంచ్ రంగు లత మహేశ్ ఆధ్వర్యంలో 20 మంది, కాంగ్రెస్‌కు చెందిన కోరెపు నవీన్ ఆధ్వర్యంలో 20 మంది చేరగా, వారికి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో పాటు కోరుట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కల్వకుంట్ల కండువాలు కప్పి ఆహ్వానించారు. రాజేశ్వర్‌రావుపేటకు చెందిన 30 మంది కోబ్రాస్ యూత్ సభ్యులు సర్పంచ్ కాట శ్రీధర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే ఆత్మకూర్ చిన్న యాదవ సంఘం సభ్యులు, ఆత్మనగర్ ఏడీబీ తండా వాసులు బీఆర్‌ఎస్‌లో చేరి, తమ మద్దతు బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్లకే ఉంటుందని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మానప్రతిని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, పార్టీ మం డల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, నాయకులు ముదాం నర్సింలు, డాకూరి వెంకటేశ్, పుల్ల జగన్‌గౌడ్, చౌట్‌పల్లి అంజయ్య, దేశవేని సత్యనారాయణ, బండ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# నేను మీ బిడ్డను.. ఆశీర్వదించండి





కొడిమ్యాల మండలం నాచుపల్లి సభకు హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్, పక్కన సింగిల్ విండో చైర్మన్ నర్సింగారావు

- నిత్యం అందుబాటులో ఉంటా.. మరింత అభివృద్ధి చేస్తా
- కాంగ్రెస్, బీజేపీ పాలనలో జరిగింది శూన్యం
- వారి మాటలు నమ్మద్దు
- చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల, అక్టోబర్ 12: 'నేను మీ బిడ్డను. మీ కష్టాలు, కన్నీళ్లు తెలిసిన బిడ్డను. స్థానికంగానే ఉంటా. ఆపదొస్తే ఆదుకుంటా. మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించండి. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని' చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్ కోరారు. కొడిమ్యాల మండలంలో రెండో రోజూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తుర్కాశినగర్, చెప్యాల, రామకిష్టాపూర్, కొండాపూర్, బోల్లెన్ చెరువు, నాచుపల్లి, కొడిమ్యాల బస్టాండ్, అంగడి బజార్‌లో ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని 60 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు చేసింది శూన్యమని, అధికారంలో ఉన్నన్ని రోజులు పనులు చేయనోళ్లు.. ఇప్పుడు చేస్తరా.. ఆలోచించాలని సూచించారు. ఎన్నికల ముందు మాత్రమే కనిపించే నాయకుల మాటలు నమ్మితే, మోసపోతామన్నారు. ఈ 45 రోజులు ఇతర పార్టీల నాయకులు చేప్పే మాటలు నమ్మకుండా మనసు నిమ్మలం చేసుకొని అభివృద్ధి చేసే బిడ్డను గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో సంక్షేమ పథకాల అములులో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతం ఎలా ఉండేదే ఒకసారి ఆలోచించాలని, ఉపాధి లేక ఎంతో మంది ముంబాయి, భీమండి వలస వెళ్లిన రోజులు ఇంకా కండ్ల ముందే కదలాడుతున్నాయని చెప్పారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించి, చెరువులు బాగుచేయడంతో వ్యవసాయం పండుగలా మారిందని, వలసలు వాపస్ వచ్చాయన్నారు. రైతుకు పెట్టుబడి బాధలు లేకుండానే ఎకరానికి రూ.5వేల సాయం అందిస్తున్నామని, రైతు బీమా, ఉచిత కరెంట్, ప్రాజెక్టులతో పుష్కలంగా జలాలు, ఇలా అనేక రకాలుగా అండగా నిలుస్తున్న ప్రభుత్వం దేశంలో ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమేనని ఉద్ఘాటించారు.

## కొప్పుల గెలువాలని పెద్దయ్య దేవుడికి మొక్కులు

ధర్మారం, అక్టోబర్12: రాష్ట్ర మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఘన విజయం సాధించాలని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తూరుకు చెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పెద్దయ్య దేవుడికి మొక్కుకున్నారు. గ్రామానికి చెందిన 40 మంది యూనియన్ సభ్యులు గురువారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని పెద్దయ్య దేవుడిని దర్శించారు. పూజలు చేశారు. కొప్పుల ఈశ్వర్ మళ్లీ గెలవాలని మొక్కుకున్నామని చెప్పారు.



ధర్మారం: దండేపల్లిలోని పెద్దయ్య దేవుడి దర్శనం అనంతరం కొత్తూరు ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

## ఆదరించండి.. అండగా ఉంటాం

- ఎమ్మెల్యే ఎం సంజయ్ సతీమణి రాధిక
- జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రచారం



జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ సతీమణి రాధిక సంజయ్‌ను సన్మానిస్తున్న మహిళలు

జగిత్యాల, అక్టోబర్ 12: 'జగిత్యాల ఎమ్మెల్యే డా. ఎం సంజయ్ కుమార్‌ను మరోసారి ఆదరించండి, అండగా ఉంటాం' అని ఎమ్మెల్యే సంజయ్ సతీమణి రాధిక సంజయ్ ఓటర్లను అభ్యర్థించారు. జిల్లా కేంద్రంలోని 18, 17 వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. స్థానిక నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ సర్కారు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక జగిత్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మౌళిక సదుపాయాలు కల్పించామన్నారు. అభివృద్ధి చేసిన ప్రభుత్వాన్ని మరొకసారి ఆదరించాలని, సంజయ్‌ను భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. ఆమె వెంట కౌన్సిలర్లు చుక్క నవీన్, సిరికొండ పద్మ సింగ రావు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.